

విద్యార్థులు సైంటిస్ట్‌లుగా ఎదగాలి

ప్రతి విద్యార్థి గొప్ప సైంటిస్ట్‌గా ఎదగాలని ఇస్రో శాస్త్రవేత్త చెరుకుపల్లి వెంకటరమణ అన్నారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 55567 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 48650 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28866 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9104 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8280 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	643.72 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2627 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 2388 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 216.67 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 168.52 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ సురేష్

చివ్వెంల(సూర్యాపేట) : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అదనపు డీఆర్‌డీఓ సురేష్ అన్నారు. శుక్రవారం చివ్వెంల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరా మహిళా శక్తి కార్యాక్రమంలో భాగంగా పాడి పశువుల పెంపకంపై మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళల కోసం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు పి.సంతోష్‌కుమార్, రాజశేఖర్, డీపీఎంలు గోవిందు, రత్తయ్య, ఆంజనేయులు, ఏపీఎం రాంబాబు, స్త్రీనిధి మేనేజర్ సతీష్, ఉపేందర్, సీసీలు ఉపేందర్, వెంకన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సూర్యాపేట టౌన్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తూ 23 ఆగస్టు 2014లో ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 28 కు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వీలైనంత త్వరగా సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేసేవరకు తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధి కల్పన అధికారి సరెండర్

భానుపురి (సూర్యాపేట) : జిల్లా ఉపాధి కల్పన అధికారి అక్బర్ హబీబ్‌ను డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్బర్ హబీబ్‌పై పలు ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అనంతరం సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కాలం తీరినా రయ్.. రయ్

- జిల్లాలో 12వేల వాహనాలు 15 ఏళ్లు పూర్తయినవే..
- రీ వ్యాలిడిటీ చేయించుకోని వాహనదారులు
- ఫిట్‌నెస్ చేయించుకోవాలంటున్న రవాణా శాఖ అధికారులు



సూర్యాపేట టౌన్ : పదిహేనేళ్లు దాటితే వాహనాలకు వ్యాలిడిటీ అయిపోతుంది. మళ్లీ వాటిని ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే కాలపరిమితి తీరిన వాహనాలు జిల్లావ్యాప్తంగా పెరిగిపోతున్నాయి. అయినప్పటికీ సదరు వాహనాల యాజమానులు రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా రోడ్లపై తిప్పుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కాల పరిమితి పెంచుకునేందుకు ఫీజులు కట్టకపోవడంతో జిల్లా రవాణా శాఖ ఆదాయానికి భారీ గండి పడుతోంది.

15 ఏళ్లు దాటితే జరిమానా చెల్లించాల్సిందే..

సూర్యాపేట జిల్లావ్యాప్తంగా జూలై 31 వరకు కార్లు, బైక్‌లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, జీపులు, కంప్రెషర్ వాహనాలు, లారీలు, ఆటోలు తదితర వాహనాలు వ్యాలిడిటీ తీరినవి రవాణా శాఖ లెక్కల ప్రకారం 12 వేల వరకు ఉన్నాయి. కార్లకు సంబంధించి 15 ఏళ్లు దాటిన తర్వాత మరో ఐదేళ్లు వ్యాలిడిటీ పొడిగించుకోవడానికి గ్రీన్ ట్యాక్స్ రూ.5వేలు, రిజిస్ట్రేషన్ రూ.5435 మొత్తం రూ.10 వేల పైనే అవుతుంది. ద్విచక్ర వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ రూ.వేయి, ఫీజు రూ.2435 మొత్తం రూ.3445 చెల్లించాల్సి ఉంటుంది. 15 ఏళ్లు దాటిన వాహనాలు రోడ్లపై తిరుగుతూ రీ వ్యాలిడిటీ చేసుకోవడానికి జాప్యం చేస్తే నెలనెలా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలో 2024 జూలై 31 వరకు వ్యాలిడిటీ పూర్తయిన వాహనాలు

ద్విచక్ర వాహనాలు	6700
కార్లు	2340
మిగతా వాహనాలు	2960
మొత్తం వాహనాలు	12000

అవకాశం కల్పించినా..

వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోకపోవడంతో అటు ప్రమాదకర ప్రయాణాలతోపాటు సదరు వాహనాలు వెదజల్లే కాలుష్యంతో పర్యావరణానికి హాని కలుగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 15 ఏళ్లు దాటిన వాహనాలకు గడువు పొడిగింపే లేదు. వాటిని తుక్కు కింద విక్రయిస్తారు. ఇక్కడ కాల పరిమితి పెంచుకునే అవకాశం కల్పించినా వాహనదారులు శ్రద్ధ చూపడం లేదు.

జరిమానాలు విధిస్తాం



15 ఏళ్లు దాటిన వాహనాలు రోడ్లపై తిరిగితే జరిమానాలు విధిస్తాం. సురక్షిత ప్రయాణానికిగాను వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. రీ వ్యాలిడిటీ పెంచుకోవాలి. అన్ని రకాల అనుమతి పత్రాలు పొంది రవాణా శాఖకు సహకరించాలి.

–జయప్రకాష్‌రెడ్డి, ఎంవీఐ, సూర్యాపేట

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నాగారం : మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులు దృష్టి సారిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పాం పంట సాగు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఒక ఎకరానికి ప్రభుత్వం రూ.4200 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకం ఇస్తుందని, గరిష్ఠంగా ఒక రైతుకు 12.50 ఎకరాల వరకు డ్రిప్ రాయితీ వర్తిస్తుందన్నారు. రుణమాఫీ కానీ రైతులు మండలంలోని వ్యవసాయ అధికారులకు, ఏఈఓలకు వివరాలు ఇచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి టి.నాగయ్య, ప్రాంతీయ ఉద్యాన అధికారులు ఎం.మహేష్, ప్రమిత, మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్, ఆయిల్ సీడ్స్ ఆఫీసర్ శ్రీకాంత్, ఉద్యాన శాఖ సిబ్బంది నరహరి, నరేష్, పతంజలి ఆయిల్ పామ్ డీజీఎం యాదగిరి, మేనేజర్ హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, కరుణాకర్, రైతులు కమటం జయమ్మ, పిలిప్స్, రవీందర్, అశోక్ రెడ్డి, మల్యాల అశోక్, జలెందర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీలు పెంచాలి

- నాబార్డు చైర్మన్ సాజికి విన్నవించిన డీసీసీబీ చైర్మన్ కుంభం



నాబార్డు చైర్మన్‌కు బొకే అందజేస్తున్న కుంభం

నల్లగొండ అగ్రికల్చర్: వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గోదాముల నిర్మాణాల కోసం రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీలు పెంచాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరిగిన నాబార్డు సమావేశానికి డీసీసీబీ చైర్మన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాబార్డు చైర్మన్ కేవీ.సాజి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కుంభం మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సహకార రైతులందరికీ సబ్సిడీలు సులభతరంగా అందేలా నాబార్డు పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని విన్నవించారు. నాబార్డుకు సబ్సిడీ పత్రాలను అప్‌లోడ్ చేయడానికి మొదట రుణ పంపిణీ తేదీని మూడు నెలల నుంచి ఆరు నెలలకు పెంచాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి ప్రభుత్వం ఇచ్చే పథకాలపై డీసీసీబీల సాయంతో నాబార్డు ప్రాంతీయ కార్యాలయాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పప్పుధాన్యాల సేకరణ ప్రాసెసింగ్ చేసిన ఉత్పత్తులను ప్రభుత్వానికి సరఫరా చేయడానికి డీసీసీబీల ద్వారా ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సూర్యాపేటలో ర్యాలీ తీస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని 100 ఫీట్ల రోడ్డు నుంచి గాంధీ విగ్రహం వరకు పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సింహాద్రి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాన్నారు. పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, మమత, సంధ్య, నవ్య, శైలజ, వనజ, శివ, సందీప్, మహేష్, నవీన్, వినయ్, వేణు, సాయిరాం, ఉదయ్, గోపి పాల్గొన్నారు.

'ప్రజా పాలన' సవరణలకు అవకాశం

- కొత్త ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం
- గృహజ్యోతి అందని అర్హులకు ఊరట
- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నాగారం : ప్రజా పాలన దరఖాస్తులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్యారంటీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడానికి ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త ఆప్షన్‌ను అందుబాటులో ఉంచింది. ప్రజాపాలన దరఖాస్తులను కొందరు ఆపరేటర్లు సరిగా ఆన్‌లైన్ చేయకపోవడం, మరికొందరు అవగాహన లేక ఆరు గ్యారంటీల్లో కొన్నింటికి టిక్ చేయలేదు. ఇలా ఎవరైతే కంప్యూటర్‌లో గ్యారంటీల కాలం ఎదుట టిక్ చేయలేదో వారికి మొన్నటివరకు ×నాట్ అప్లయ్‌×అనే సమాచారం వచ్చింది. దీంతో అర్హులు ఏడు నెలలుగా గృహజ్యోతి పథకానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. నాట్ అప్లయ్ అనే సమాచారం వచ్చిన గడులను సవరించే అవకాశం లేకపోవడంతో అర్హులు ప్రభుత్వానికి వినతులు పెట్టుకున్నారు. ఇప్పుడు తిరిగి అప్లయ్ చేసుకోవడానికి కొత్త ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో అర్హులైన వారు ప్రజాపాలన కేంద్రాలకు వెళ్లి వివరాలు సమర్పిస్తున్నారు.



నాగారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన హెల్ప్ డెస్క్

పత్రాలు వెంట తీసుకెళ్లాలి..

ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా ప్రభుత్వం జనవరి నెలలో పేద, మధ్య తరగతి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దీనిలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాయితీపై గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. కానీ కొంతమంది దరఖాస్తుల్లో తప్పులు దొర్లడంతో వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోయాయి. దీంతో వారికి ప్రయోజనం చేకూరేలా ప్రజాపాలన కేంద్రాలను ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. గతంలో దరఖాస్తుదారులు ఎక్కడ దరఖాస్తు చేశారో అక్కడికే వెళ్లి తమ వివరాలు అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రజాపాలన పత్రం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లులోని యూఎస్‌సీ నంబర్‌ను వెంట తీసుకెళ్లి వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలి. వివరాలు అప్‌డేట్ అయితే గృహజ్యోతి పథకానికి అర్హత లభిస్తుంది. ఇదివరకు దరఖాస్తు చేసుకుని విద్యుత్ జీరో బిల్లు రాని వారైతే మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసిన రశీదు చూపించి సరిచేసుకోవచ్చు. అద్దె ఇంటిని ఖాళీ చేసి మరో ఇంట్లో ఉంటే మీటరు నంబర్ మార్చుకునే ఎడిట్ ఆప్షన్ ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు గృహజ్యోతి లబ్ధిదారులు 1,69,372 మంది ఉన్నారు. పెండింగ్ దరఖాస్తులకు మోక్షం లభించినట్లయితే లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి



అర్హులై ఉండి గృహజ్యోతి పథకం వర్తించని వారు ప్రజాపాలన కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు అప్‌డేట్ చేయించుకోవాలి. గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రజాపాలన పత్రం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లులోని యూఎస్‌సీ నంబర్‌ను వెంట తీసుకెళ్లి వివరాలను నమోదు చేయించుకోవాలి.

– శ్రీనివాస్, విద్యుత్‌శాఖ డీఈఈ, సూర్యాపేట

నాణ్యమైన ఆహారం అందించండి

- సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ద్రోణాచార్యులు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులకు సన్న బియ్యంతో వండిన నాణ్యమైన ఆహారం అందించాలని సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ద్రోణాచార్యులు అన్నారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతతో కలిసి శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకం, బియ్యం నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, హాస్టళ్లలో బియ్యాన్ని పద్ధతి ప్రకారం భద్రపరచాలని ఆదేశించారు. ఎక్కడైనా బియ్యం నాణ్యతలో లోపాలు ఉంటే జిల్లా మేనేజర్, సివిల్ సప్లయ్ అధికారులకు తెలిపి వాటిని వెంటనే మార్చి మంచి బియ్యం తీసుకోవాలన్నారు. అడిషనల్ కలెక్టర్ బి.ఎస్.లత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలను తనిఖీ చేశారు. మిగిలిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలని సంబంధిత స్కూల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పదో తరగతి క్లాస్ రూం తనిఖీ చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ప్రసాద్, డీఎస్ఓ రాజేశ్వర్, సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ పరిధిలో..

హుజూర్‌నగర్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం ఇవ్వాలని స్టేట్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం ఓఎస్‌డీ ఎం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పరిధిలోని మైనారిటీ గురుకుల పాఠశాలతోపాటు పలు గురుకుల వసతి గృహాలు, పాఠశాలలను టాస్క్ ఫోర్స్ టీం అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఎస్ఐ జంగయ్య, కోదాడ డీటీసీఎస్ రాంరెడ్డి ఉన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని పలు గురుకుల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో మౌలిక వసతులు, భోజనం పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎం.ప్రభాకర్, టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి లక్ష్మారెడ్డి, ఎస్ఐ జంగయ్య, కోదాడ డీటీసీఎస్ ఎం.రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



సూర్యాపేటటౌన్ : జెడ్పీ బాలుర పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారని మంత్రి క్యాంప్ కార్యాలయ అధికారి కె.వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉత్తమ్ మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీ నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా మంత్రి రోడ్డుమార్గం ద్వారా హుజూర్‌నగర్‌కు బయలుదేరుతారు. మధ్యాహ్నం హుజూర్‌నగర్ పట్టణంలో శ్రీ విజయ హాస్పిటల్, శ్వేత హాస్పిటల్, అను శ్రీ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు చౌటపల్లిలో శ్రీ వేణుగోపాలస్వామి మందిర రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన, 7: 30 గంటలకు రఘునాథపాలెం పీఏసీఎస్ గోడౌన్‌కు మంత్రి ప్రారంభోత్సవం చేస్తారు. మాజీ కో ఆప్షన్ సభ్యుడు మౌలానా మృతిచెందడంతో రాత్రి 8:00 గంటలకు కిష్టాపురంలో బాధిత కుటుంబ సభ్యులను మంత్రి ఉత్తమ్ పరామర్శిస్తారని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే నూతన రెవెన్యూ చట్టం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : భూ సమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతులు, యువకులు, పాత్రికేయులు, నిపుణులతో ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు అందించాలని కోరారు. నూతన చట్టం రూపకల్పనలో రైతులను, ప్రజలను, మేధావులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వర్క్‌షాప్‌లు నిర్వహించాలని ఆదేశించిందని అన్నారు. నూతన రెవెన్యూ చట్టం–2024 బిల్లు అంశాలు, తీసుకురావడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్ లత వివరించారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను తెలియజేశారు. చట్టం మార్పు చేసేటప్పుడు భూ సర్వే నిర్వహించాలని, భూమిపై ఉన్న రైతుల వివరాలు మాత్రమే నమోదు చేయాలన్నారు. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థ ఉండాలని, ప్రతి సంవత్సరం పహానీలో నూతన పేర్లు నమోదు చేయాలని, శిస్తు వసూలు మళ్లీ పెట్టాలని, పొజిషన్ కాలం ఉండాలని సూచించారు. గ్రామాలవారీగా ఉన్న సర్వే నంబర్లలో భూమి ఎక్కువగా ఉంటుందని, దానిని సరిచేయాలని, భూమి అమ్మిన వారి పేర్లను తొలగించాలని, ధరణి పోర్టల్‌తో రైతులకు చాలా నష్టం జరిగిందని దాన్ని తీసివేయాలని కోరారు. ఈ సమావేశానికి రానివారు నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు సూచనలు ఏమైనా ఉంటే ror2024&rev@telangana.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ సభ్యులు సోమేశ్, తహసీల్దార్లు, న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, రిటైర్డ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాస్తు కాలం ఉండాలి



ధరణి పోర్టల్‌లో కాస్తు కాలం, కబ్జాకాలం లేకపోవడంతో ఇష్టానుసారంగా పట్టాలు జరుగుతున్నాయి. కొత్త రెవెన్యూ చట్టంలో కాస్తు కాలం తప్పనిసరి చేయాలి. వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలి. ప్రతి గ్రామంలో భూ రికార్డుల వివరాలు నోటీస్ బోర్డుపై ఉంచాలి.

–కాకి కృపాకర్‌రెడ్డి, ఆత్మకూర్ (ఎస్)

భూముల సర్వే చేయాలి



ప్రభుత్వం కొత్తగా చట్టాన్ని తీసుకురావాలంటే ముందుగా భూముల సర్వే చేయాలి. రికార్డులు సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పాస్‌పుస్తకాల్లో ఉన్న సర్వే నంబర్‌కు, రైతు కబ్జాలో ఉన్న సర్వే నంబర్లకు పొంతన లేదు.

–నంద్యాల కృష్ణారెడ్డి, నంద్యాలవారిగూడెం

ప్రతి సంవత్సరం పహాణీలు విడుదల చేయాలి



పాత పద్ధతిలోనే ప్రతి సంవత్సరం పహాణీలను విడుదల చేయాలి. శిస్తు అమలు చేయకపోవడంతో రైతు ఎవరో తెలియడం లేదు. పాత రికార్డులను పునరుద్ధరించి ధరణి పోర్టల్‌ను సవరించి అమలు చేయాలి.

–సామ వెంకటరెడ్డి, మోతె

తహసీల్దార్లకు కొన్ని అధికారాలు ఇవ్వాలి



గతంలో మాదిరిగానే 16 రకాల రికార్డులను నమోదు చేయాలి. పహాణీలను ప్రతి సంవత్సరం విడుదల చేయాలి. కాస్తు కాలం, కబ్జా కాలం ఉండాలి. రెవెన్యూ కోర్టులను అమలుపరచాలి. తహసీల్దార్లకు కొన్ని అధికారాలు ఇవ్వాలి.

–ఎల్.భద్రయ్య రిటైర్డ్ తహసీల్దార్

క్లుప్తంగా

తేరట్‌పల్లి వాసికి హరితరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న పాపిరెడ్డి

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలంలోని తేరట్‌పల్లి గ్రామానికి చెందిన డాక్టర్ చనమల్ల పాపిరెడ్డి శుక్రవారం హరితరత్న అవార్డు అందుకున్నారు. ఆయన ప్రస్తుతం ఢిల్లీలోని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖలో సీనియర్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆ శాఖలో చేస్తున్న కృషిని బెనారస్ హిందూ యూనివర్సిటీ వారణాసి వారు గుర్తించి హరిత రత్న అవార్డుకు ఎంపిక చేశారు. ఆ అవార్డును ఆయన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి ధర్మపాల్‌సింగ్ చేతుల మీదుగా ఢిల్లీలో అందుకున్నారు. పాపిరెడ్డి తేరటిపల్లి గ్రామంలో మధ్యతరగతికి చెందిన ఓ రైతు కుటుంబంలో జన్మించారు.

ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం

చిట్యాల : మండలంలోని నేరడ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పాము కలకలం రేపింది. పాఠశాలను శుభ్రం చేసే వ్యక్తి రోజు మాదిరిగానే ఉదయం పాఠశాల ప్రారంభసమయంలో తలుపులు తెరవడంతో పాఠశాలలోని గదిలో పాము కనిపించింది. దీంతో ఆ పాఠశాల సమీపంలోని యువకులకు విషయం తెలపడంతో వారు పామును చంపి బయటపడేశారు. పాఠశాల గదిలోకి పాము రావడంతో విద్యార్థులు కాసేపు భయాందోళనకు గురయ్యారు.

ద్విచక్రవాహనం దహనం



దహనమైన ద్విచక్రవాహనం

కనగల్ : ఇంట్లో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనం దహనమైన ఘటన మండల పరిధిలోని ఇస్లాంనగర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్‌కే బాబా రోజుమాదిరిగా తన ద్విచక్రవాహనాన్ని ఇంట్లో పార్కింగ్ చేసి కూలీ పనికి భార్యతో కలిసి వెళ్లాడు. ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో బైక్ దహనమవుతుండడంతో చుట్టు పక్కల వారు గమనించి బాబాకు సమాచారం అందించారు. అతడు వచ్చే సరికి అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. గ్రామంలో ఎవరితో ఎలాంటి శత్రుత్వం, అనుమానం లేదని బాధితుడు పేర్కొన్నాడు.

యువకుడి బలవన్మరణం

సంస్థాన్ నారాయణపురం : అనారోగ్య సమస్యలతో మనస్థాపానికి గురై ఓ యువకుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని జనగాం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కానుగుల నరేష్(30) కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొన్ని నెలల క్రితం నరేష్ అనారోగ్యానికి గురై తర్వాత కొలుకున్నప్పటికీ ఇటీవల మళ్లీ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతడి తండ్రి వెంకటయ్య, తమ్ముడు కలిసి బంధువుల శుభకార్యానికి వెళ్లారు. తల్లి గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందగా చూడటానికి వెళ్లింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో నరేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తిరిగి ఇంటి వచ్చిన తల్లి చూడగా కుమారుడు ఫ్యాన్‌కు ఉరివేసుకోని విగతజీవిగా కనిపించడంతో బోరున విలపించింది.

గంజాయి రహిత సమాజమే లక్ష్యం

- నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న నల్లగొండ ఎస్పీ. చిత్రంలో మెడికల్ కాలేజీ విద్యార్థులు, ప్రొఫెసర్లు

నల్లగొండ క్రైం : మాదకద్రవ్యాలు, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, ఈవ్‌టీజింగ్, సైబర్‌నేరాలపై కామినేని మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీ ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాలు నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎవరైనా గంజాయి క్రయవిక్రయాలు చేసినా, సేవించిన టోల్ ఫ్రీ నంబర్ 87126 70266కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 అమలవుతుందని, ఒకసారి కేసు నమోదైతే 6నెలల నుంచి 3సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఎవరైనా సైబర్‌నేరాలకు పాల్పడితే బాధితులు 1930కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములునాయక్, సైబర్ క్రైమ్ డీఎస్పీ పి.లక్ష్మీనారాయణ, షిటీమ్ ఇన్‌చార్జ్ సీఐ కరుణాకర్, నాగరాజు, నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాబాసాహెబ్ కాడగి, డెంటల్ ప్రిన్సిపల్ డాక్టర్ మహేష్, అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ రంగారావు, అకాడమిక్ డాక్టర్ సుధీర్ బాబు, రాంమోహన్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ, ఏఎస్పీ, తదితరులు

కుమారుడి చదువు కోసం వెళ్లి.. అనంతలోకాలకు

- మధ్యప్రదేశ్ రాష్ట్రంలో యాదాద్రి జిల్లా వాసి మృతి
- కుమారుడిని భోపాల్ ట్రిపుల్ ఐటీలో జాయిన్ చేయడానికి వెళ్లిన తండ్రి
- తిరిగి వస్తుండగా బస్సు ప్రమాదంలో మృతి



వెంకటనరసింహారెడ్డి (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: కుమారుడిని ఉన్నత స్థాయిలో చూడాలనుకున్న ఆ తండ్రి తన ఆశ తీరకుండానే కన్నుమూశాడు. తన కుమారుడిని ఉన్నత విద్యా సంస్థలో చేర్పించి తిరిగి వస్తూ బస్సు ప్రమాదంలో కన్నుమూశాడు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటకు చెందిన బత్తి వెంకటనరసింహారెడ్డి (48) బొమ్మలరామారం మండలంలోని తిరుమలగిరి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు కుమారుడు ప్రణీత్, కూతురు ఉన్నారు. భార్య సునీత బీబీనగర్ మండలం కొండమడుగులో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. పిల్లల చదువుల నిమిత్తం హైదరాబాద్ బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నారు. కూతురు ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. తన కుమారుడికి ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని డీమ్డ్ యూనివర్సిటీలో ట్రిపుల్ ఐటీ సీటు వచ్చింది. కుమారుడిని జాయిన్ చేయడానికి ఈ నెల 21న వెంకటనరసింహారెడ్డి భోపాల్‌కు వెళ్లాడు. 22వ తేదీ గురువారం ఉదయం తన కుమారుడిని ట్రిపుల్ ఐటీ కళాశాలలో చేర్పించారు. తిరిగి రాత్రి భోపాల్ నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. రాత్రి 10 గంటల సమయంలో మధ్యప్రదేశ్‌లోని పంధుర్నా జిల్లా (మహారాష్ట్ర సరిహద్దు)లో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వెంకటనరసింహారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనతో పాటు బస్సు లో పలువురు మృతిచెందగా... మరికొందరికి గాయాలయ్యాయి. వెంకటనరసింహారెడ్డి వద్ద దొరికిన ఆధారాల ద్వారా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. శుక్రవారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతడి మృతదేహానికి శనివారం బోడుప్పల్‌లో అంత్యక్రియలు జరగనున్నాయి.

చదువే పిల్లలకు మనమిచ్చే ఆస్తి

చదువే పిల్లలకు మనమిచ్చే ఆస్తి అని వెంకటనరసింహారెడ్డి తరచూ చెప్పేవాడని ఆయన స్నేహితులు గుర్తుచేసుకుంటున్నారు. పిల్లలకు మంచి చదువు చెప్పిస్తే వారి భవిష్యత్ జీవితం బంగారుమయంగా ఉంటుందని, ఎప్పటికైనా తన కొడుకును ఉన్నత స్థాయిలో చూడడమే తన లక్ష్యమని స్నేహితులతో అంటుంటేవాడు. తమ కుటుంబం మొత్తం ఉన్నత చదువులు చదివి, మంచిస్థాయిలో ఉన్నారని చెప్పేవాడు. తన కొడుకు చదువు కోసం వెళ్లి తన ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని వెంకటనరసింహారెడ్డి స్నేహితులు పేర్కొన్నారు.

4 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- తొమ్మిది మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్ : అక్రమంగా పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన కేసు వివరాలను శుక్రవారం మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖరరాజు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మిర్యాలగూడ మండలంలోని జంకుతండా గ్రామానికి చెందిన ధనావత్ నరేందర్, రమావత్ శ్రీను, ధీరావత్ సోనీ, ఊట్ల వెంకటేశ్వర్‌రావు, వసుమర్తి నాగేశ్వర్‌రావు, బీర్ల వెంకట్‌రెడ్డి అనే వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి గ్రామాలు, పట్టణాలలో రేషన్ బియ్యాన్ని కొంత మంది నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని నూకలుగా మార్చి పలువురు వ్యాపారుల ట్రేడింగ్ బిల్లులను ఉపయోగించి హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఓ రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి నూకలుగా మార్చడానికి సిద్ధంగా ఉంచారనే విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ జిల్లా పోలీసులు దాడి చేసి నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ధనావత్ నరేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పూర్తి విషయం వెలుగులోకి వచ్చిందని, దీంతో మిగతా నిందితులతో పాటు ట్రేడింగ్ బిల్లు పేపర్లు ఇచ్చిన పోతుగంటి శ్రీనివాస్, పంపాటి శ్రీనివాస్, రామయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తూ డివిజన్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న నరేందర్‌తో పాటు రమణ అనే ఇద్దరు వ్యక్తులపై పీడీయాక్ట్ నమోదుకు జిల్లా పోలీసు అధికారులకు నివేదించామని అన్నారు. సమావేశంలో ఆయన వెంట రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు, దస్రు, శ్రీనివాస్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య, సైదయ్య, మహేష్, సైదానాయక్, వెంకటేశ్వర్లు, హోంగార్డులు మురళి ఉన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

గుర్రంపోడు : ఓ కిరాణా దుకాణంలో నిల్వచేసిన 160కేజీల రేషన్ బియ్యాన్ని శుక్రవారం మండల పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. మండలంలోని చామలేడు గ్రామంలో సముద్రాల రాజు కిరాణం దుకాణంలో రేషన్ బియ్యం నిల్వచేశారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో గ్రామస్తుల నుంచి సేకరించి బహిరంగ మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న 160కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

చేతబడి చేశాడనే నెపంతో వృద్ధుడిపై దాడి

అడవిదేవులపల్లి : చేతబడి చేస్తున్నాడనే నెపంతో ఓ వృద్ధుడిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జానకి కొండయ్య అనే వృద్ధుడిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు (ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు) తమకు చేతబడి చేస్తున్నాడనే నెపంతో దాడి చేశారు. తమ పశువులు సరిగా మేత మేయడం లేదని, తాము అనారోగ్యంగా ఉండడానికి కొండయ్య చేతబడే కారణమని దాడి చేసినట్లు కొండయ్య కుమారుడు జానకి లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరి శీలించి వివరాలు సేకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేతబడి, బాణామతి, క్షుద్రపూజలు కేవలం మూఢనమ్మకాలు మాత్రమే నని, ఎవరూ వాటిని నమ్మకూడదని అన్నారు. చట్టాన్ని ఎవరూ కూడా తమ చేతుల్లోకి తీసుకోకూడదని పోలీసులు హెచ్చరించారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంక్ మేనేజర్ అరెస్ట్

నూతనకల్లు : ఖాతాదారులకు తెలియకుండా వారి పేరుమీద రుణాలు మంజూరు చేసి సొంతానికి వాడుకున్న బ్యాంక్ మేనేజర్‌ను మండల పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను తుంగతుర్తి సీఐ డి.శ్రీను వెల్లడించారు. మండలంలోని తాళ్లసింగారం గ్రామ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసిన సంగీ హరిప్రసాద్ ఖాతాదారులకు తెలియకుండా ముద్ర, పీఎంఎఫ్‌ఎంఈ, ఎస్‌హెచ్‌జీ, కేసీసీ ఇతర లోన్లను మంజూరు చేసుకోని రూ.2,05,35,350నగదును తన అపెక్స్ ఏసీసీ బ్రిక్స్ కంపెనీకి మళ్లించారు. అనంతరం ఉద్యోగ బదిలీలో భాగంగా ఆయన స్థానంలో నూతన బ్యాంక్ మేనేజర్‌గా విధులకు వచ్చిన డి.రవీందర్ ఆ బ్యాంకు లావాదేవీలను పరిశీలించడంతో బది లీపై వెళ్లిన బ్యాంక్ మేనేజర్ బాగోతం బయటపడింది. ఖాతాదారులకు తెలియకుండా డబ్బులు దారి మళ్లించారని బ్యాంక్ మేనేజర్ రవీందర్ నిర్ధారించుకోని అందుకు కారకుడైన గత మేనేజర్ హరిప్రసాద్‌తో పాటు మరో 13మందిపై పోలీస్‌స్టేషన్‌లో మార్చి 20న ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవి పర్యవేక్షణలో కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

నల్లగొండ క్రైం : ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని సాగర్‌రోడ్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పెద్దబండకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై సాగర్ రోడ్డు వైపు వెళ్తుండగా అదే సమయంలో సాగర్ రోడ్‌లోని పెట్రోల్ బంక్ నుంచి నల్లగొండ పట్టణంలోకి వస్తున్న ఓ బైక్‌ను ఎదురుగా వెళ్లి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

పులిచింతలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టుకు శుక్రవారం ఎగువ నుంచి 32,232 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్ట్ ఒక క్రస్ట్ గేటును 1.30మీటర్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 12,620 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 175అడుగులకు 174.80అడుగుల మేర నీరు ఉంది.

జెన్‌కోలో 104మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 105మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ దేశ్యానాయక్ వెల్లడించారు.

ప్రతి విద్యార్థి గొప్ప సైంటిస్ట్‌గా ఎదగాలి

- ఇస్రో శాస్త్రవేత్త చెరుకుపల్లి వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

సూర్యాపేటటౌన్ : ప్రతి విద్యార్థి గొప్ప సైంటిస్ట్‌గా ఎదగాలని, విద్యార్థి దశ నుంచే కష్టపడి చదవాలని ఇస్రో శాస్త్రవేత్త చెరుకుపల్లి వెంకటరమణ అన్నారు. సూర్యాపేట్ట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల– 2లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పాఠశాలలో నేను మీ స్థానంలో కూర్చొని నేడు గొప్పస్థానంలో ఉండటానికి ఉపాధ్యాయులే కారణమని విద్యార్థులనుద్దేశించి అన్నారు. గురువులు చెప్పిన ప్రతి విషయాన్ని శ్రద్ధగా విని గొప్పవ్యక్తులుగా ఎదగాలన్నారు. పాఠశాల విద్యార్థులు చేసిన వివిధ రకాల డ్రాయింగ్‌లను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలలో పదోతరగతిలో టాప్ 1, 2, 3 స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.రవి, పాఠశాల హెచ్‌ఎం ఎం.ఉదయశ్రీ, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, అంకతి వెంకన్న, నరేందర్, కరుణాకర్, శ్రీనివాసరావు, రాజేష్, శ్రీరాములు, సుజాత, లలిత తదితరులు పాల్గొన్నారు.

రుణం తీరిపోయింది!

- రుణమాఫీ డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లి గుండెపోటుతో రైతు మృతి



గోపాల్ (ఫైల్)

రామన్నపేట : రుణమాఫీ డబ్బులను డ్రా చేసుకునేందుకు బ్యాంకు వెళ్లిన రైతు గుండె పోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో శుక్రవారం జరిగింది. రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామానికి చెందిన పాలిమెర గోపాల్ (72)కు గ్రామంలో 3.35 ఎకరాల భూమి ఉంది. ఆయనకు ఇటీవలే ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ పథకం కింద రూ.1,35,000 మాఫీ అయ్యాయి. ఆ డబ్బులను డ్రా చేసుకునేందుకు శుక్రవారం పెద్దకుమారుడు రాములుతో కలిసి మునిపంపుల గ్రామంలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లాడు. చెక్ బుక్కు లేకపోవడంతో పరిమితికి మించిన నగదును డ్రా చేసే అవకాశం లేదు. వయోభారంతో బ్యాంకు చుట్టూ తిరగలేక తన ఖాతాలోని రూ.80 వేలను తన కుమారుడి ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయించడం కోసం పరిచయస్తుడిని ఓచర్ రాయమని చెప్పి కుర్చీ మీద కూర్చున్నాడు. ఓచర్ రాస్తున్న వ్యక్తితో మాట్లాడుతూనే గుండెపోటుకు గురై గోపాల్ కుప్పకూలిపోయాడు. ఓ యువకుడు వెంటనే సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం ఇస్కిళ్లకు తరలించారు. మృతునికి భార్య, ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లయ్య

కనగల్ : ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలంలోని పల్లిపాడు గ్రామానికి చెందిన మామిడి సైదులు, మాతంగి ప్రసాద్, మామిడి ఎల్లయ్య గురువారం అదే గ్రామానికి చెందిన బంధువు పెళ్లి దర్వేశిపురంలో జరగడంతో హాజరయ్యారు. వారు తిరిగి స్వగ్రామానికి ఒకే ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మామిడి సైదులు ద్విచక్రవాహనాన్ని అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో కనగల్ గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డుకు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్య, మాతంగి ప్రసాద్ తలలకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి వారిని 108లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఎల్లయ్య(70) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందగా ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉందన్నారు. మృతుడి కుమారుడు మామిడి వంశీ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

నీటిసంపులో పడి బాలుడు దుర్మరణం

- ఫిట్స్ రావడంతో ప్రమాదం
- శాలిగౌరారం మార్కెట్‌కాలనీలో విషాదం



కంది దుర్గప్రసాద్ (ఫైల్)

శాలిగౌరారం : నీటిసంపు వద్ద వంటపాత్రలు శుభ్రం చేస్తున్న ఓ బాలుడు ఫిట్స్ రావడంతో అందులో పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని మార్కెట్‌కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మార్కెట్‌కాలనీకి చెందిన కంది దుర్గప్రసాద్ (17) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఐదేళ్ల క్రితం దుర్గప్రసాద్ తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో నాటి నుంచి దుర్గప్రసాద్ ఒకపక్క చదువుకుంటూ తండ్రికి ఆసరాగా నిలిచి కుటుంబంలో వంట పనులు చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో రోజువారీగానే శుక్రవారం వంట చేసేందుకని అతడి ఇంటి ఎదురుగా ఖాళీగా ఉన్న తాందారు శ్రీను ఇంట్లో వంట పాత్రలను శుభ్రం చేసేందుకు వెళ్లాడు. పాత్రలను శుభ్రం చేస్తున్న సమయంలో నీటిసంపులో నుంచి నీటిని తోడే సమయంలో ఫిట్స్ వచ్చి అందులో పడి మృతి చెందాడు. కొంత సమయం తర్వాత అటుగా వెళ్లిన కంది సైదులు నీటిసంపు వద్ద వ్యక్తి కాళ్లు బయటకు కనిపించడంతో దగ్గరకు వెళ్లి చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి దుర్గప్రసాద్‌ను నీటి సంపు నుంచి బయటకు తీశారు. అప్పటికే దుర్గప్రసాద్ మృతి చెందాడు. దుర్గప్రసాద్ అకాలంగా మృతి చెందడంతో మార్కెట్‌కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. దుర్గప్రసాద్ మృతదేహాన్ని కాంగ్రెస్ మండల నాయకులు చాడ సురేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, చామల మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు కట్ట వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాసులు, గుజిలాల్ శేఖర్ బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్, తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న మూసీ నీటి విడుదల



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతుంది. దీంతో అధికారులు గురువారం పైకెత్తిన మూడు క్రస్టు గేట్లను శుక్రవారం యధావిధిగా ఉంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఒక్కో గేటును అడుగు మేర ఎత్తి 1,943క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి మూసీకి 2,627క్యూసెక్కుల నీరు వస్తుండడంతో ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 385.19 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం 2,388క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645అడుగులు కాగా ప్రస్తుతం 643.72మేర అడుగుల నీరు నిల్వ ఉంది. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.12టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ వెల్లడించారు.

ఆక్రమణకు గురవుతున్న భూములను కాపాడాలి



మాట్లాడుతున్న వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ టౌన్ : నీటి పారుదల శాఖకు సంబంధించిన విలువైన భూములు, ఇళ్లు ఆక్రమణకు గురవుతున్నందున వాటిని ప్రభుత్వాలు కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో కబ్జాలు చేసి కట్టిన ఇళ్లను హైడ్రా తరుపున ఏవిధంగా కూల్చుతున్నారో అదే విధంగా నాగార్జునసాగర్ నుంచి నిడమనూరు, త్రిపురారం, మిర్యాలగూడ, నేరేడుచర్ల, పొంచర్ల, కోదాడ, వైరా ఖమ్మం వరకు నీటిపారుదల భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఆ కట్టడాలను కూడా కూల్చి వేసి ఆ విలువైన భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆ భూములను కబ్జాలు చేసిన వారు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని ఆరోపించారు. కొంత మంది ఏపార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి వెళ్లి కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. సమావేశంలో ఆయన వెంట నాయకులు ఇంద్రపల్లి గురువయ్య, డేగ వీటి తదితరులున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రగాయాలు

మోతె : మద్యం మత్తులో అజాగ్రత్తగా ద్విచక్రవాహనం నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని బోడబండ్లగూడెం గ్రామానికి చెందిన దారా ఉపేందర్(35) మండల కేంద్రానికి పనినిమిత్తం వెళ్తుండగా మోతె గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం సేవించి బైక్‌పై వస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న ఉపేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని స్థానికులు 108వాహనంలో సూర్యాపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. యువకుల బైక్‌లో ఉన్న బీరు బాటిళ్లు రహదారిపై పడి చెల్లాచెదురయ్యాయి.

అద్దాన్ని చోరీ చేశారు.. మళ్లీ అమర్చారు!



సంస్థాన్ నారాయణపురం శివారులో అద్దాన్ని చోరీ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



అద్దం చోరీ చేసి మళ్లీ యథాస్థానంలో అమర్చిన గుర్తుతెలియని వ్యక్తులు

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రం శివారులోని రహదారిలో ఓ మూలమలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా అధికారులు అమర్చిన అద్దాన్ని ఈనెల 16న గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. చోరీ చేసిన ఆ అద్దాన్ని శుక్రవారం మరల యథాస్థానంలో అమర్చి వెళ్లారు. ఈనెల 16న అద్దాన్ని చోరీ చేయగా, 19న మిర్రర్ ఫ్రేం చోరీ చేశాడు. ఈ అద్దాన్ని రోడ్డు మూలమలుపుల వద్ద జరిగే ప్రమాదాలు చోటు చేసుకోకుండా గుడిగుట్ట సత్యనారాయణస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ అద్దాన్ని పుణే నుంచి తెప్పించారు. రూ.2లక్షలతో 24అద్దాలను పుట్టపాక, సంస్థాన్ నారాయణపురం, మహ్మదాబాద్, గుడిమల్కాపురం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేశారు.